27072024-DIS-04_Layout 1 7/27/2024 2:37 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ప్రాజెక్టు పునరుద్ధరణే తక్షణ కర్తవ్యం

కాళేశ్వరంపై విష ప్రచారం.. అసలు వాస్తవాలు-2

వి.ప్రకాష్

2.ప్రాణహిత- చేవెళ్ల గ్రావిటీ ప్రాజెక్టా?

తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి పాత మార్గంలో నీటిని తరలించినా అది ఎత్తిపోతల పథకమే తప్ప గ్రావిటీ కానే కాదు. ప్రాణహిత- చేవెళ్లను మూర్ఖుడు మాత్రమే గ్రావిటీ పథకమని అనగలడు. 2007లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పనులను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహారాష్ట్రతో ఒప్పందం లేకుండానే ప్రారంభించింది. ఏ ప్రభుత్వమైనా మొదట హెడ్ వర్క్స్‌ను పూర్తి చేసి, కాలువలను తవ్వుతుంది. ఇక్కడ మాత్రం తలను వదిలేసి తోక నుంచి పనులు మొదలు పెట్టారు. తుమ్మిడిహట్టి నుంచి 75 కిలోమీటర్ల కాలువను తవ్వి, సింగారేణి భూములు అడ్డురావడంతో వదిలేశారు. ఈ లోపు తెలంగాణ ఏర్పాటైంది. పైన వివరించిన పరిణామాల నేపథ్యంలో రీ ఇంజినీరింగ్ చేయవలసి వచ్చింది. కాబట్టి, తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని ఎల్లంపల్లికి తీసుకురావచ్చన్నది అబద్ధపు ప్రచారమే. ఎల్లంపల్లి నుంచి రీ ఇంజినీరింగ్ తర్వాత కూడా జలాశయాల నిల్వ సామర్థ్యం పెంచడం తప్ప ఏ మార్పు లేదు.

వార్ధా బ్యారేజీ ఎందుకు?: గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి, ఆ బ్యారేజీ ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు 20 టీఎంసీల సాగునీరు ఇవ్వాలని భావించింది. తుమ్మిడిహట్టి వద్ద నది ప్రవాహం 40 డిగ్రీల కోణంలో ఉండటంతో నిర్మాణం క్లిష్టమైనది. ఖర్చు కూడా భారీగా ఉండటంతో ప్రభుత్వం 20 టీఎంసీల నీటిని తరలించడానికి వార్ధా నదిపై వీర్దండి గ్రామం వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. దీంతో బ్యారేజీ నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా, ఖర్చు భారీగా తగ్గింది. రూ.4,550 కోట్లకు డీపీఆర్ తయారైంది. అయితే ప్రభుత్వం మారడంతో ఇది కనుమరుగైంది.

3.డీపీఆర్ లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించారా?

ఇది కూడా అబద్ధపు ప్రచారమే. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కొన్ని కీలకమైన తేదీలను పరిశీలిస్తే వారు చేసిన ఆరోపణ అబద్ధమని తేలిపోతుంది. 2016 మే 2న కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన జరిగింది. 2019 జూన్ 21న ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. ప్రాజెక్టు పనులకు, శంకుస్థాపనకు ముందు జరిగిన సంఘటనలు ఇలా ఉన్నాయి. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు రీ ఇంజినీరింగ్ చేయాలని నిర్ణయించిన వెంటనే 2015 ఏప్రిల్ 22న కేంద్ర ప్రభుత్వ సంస్థ వాప్కోస్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి వర్క్ ఆర్డర్ జారీ చేసింది. వారు 2016 జనవరి 17 నాటికి మూడు బ్యారేజీలకు సంబంధించిన డిజైన్, డ్రాయింగ్, అంచనాలను అందించారు. వాటి ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ పనులకు ప్రభుత్వం 2016 మార్చి 1న పరిపాలనా అనుమతులను జారీచేసింది. ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ 2016 ఏప్రిల్ 11న టెక్నికల్ శాంక్షన్ ఇచ్చారు. అనంతరం బ్యారేజీల నిర్మాణానికి 2016 మే 3న టెండర్లు పిలిచారు. కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ అంతిమ నిర్ణయం మేరకు మూడు బ్యారేజీల పనులను వేర్వేరు కంపెనీలకు 2016 ఆగస్టు 26న అప్పగించారు. భూభౌతిక పరీక్షలు, ఇతర అధ్యయనాలు జరిగిన తర్వాతనే, వాటి ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వ డిజైన్స్ విభాగం బ్యారేజీలకు డిజైన్లను అందించింది. భూభౌతిక పరీక్షలు జరపకుండా బ్యారేజీలే కాదు, ఏ నిర్మాణం చేపట్టరు. Design of Barrages on Permeable Foundations పై కేంద్ర జల సంఘం, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారు జారీ చేసిన మార్గదర్శకాలు, సర్క్యులర్లు, కోడ్‌లను తు.చ తప్పక పాటించి బ్యారేజీల డిజైన్లను రూపొందించారు. కాళేశ్వరం బ్యారేజీల డిజైన్లలో లోపాలు ఉన్నాయని అనడం అంటే కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, సర్క్యులర్లు, కోడ్‌లను తప్పుబట్టడమే. ఈ నివేదికను ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి 2017 ఫిబ్రవరి 22న, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు 2017 మార్చి 27న సమర్పించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు 2017 మార్చి 31న జారీ అయిన మొదటి దశ పర్యావరణ అనుమతితో ప్రారంభమైన కేంద్ర ప్రభుత్వ అనుమతుల ప్రక్రియ చివరగా 2018 జూన్ 6న జారీ అయిన టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదంతో ముగిసింది. కాబట్టి డీపీఆర్ లేకుండా, ఎటువంటి అధ్యయనాలు, భూభౌతిక పరీక్షలు జరపకుండా ప్రాజెక్టు పనులను ప్రారంభించారన్న ఈ ఇద్దరు మేధావుల ఆరోపణలకు ఏ విలువ లేదు.

4.నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదికలో నిజమెంత?

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ 2023 అక్టోబర్ చివరలో హడావుడిగా వండివార్చిన రాజకీయ నివేదికపై నాడే విమర్శలు వెల్లువెత్తాయి. ఎటువంటి పరిశీలన జరపకుండానే, ఎటువంటి భూభౌతిక పరీక్షల ఫలితాలు లేకుండానే, తెలంగాణ ఇంజినీర్లతో చర్చించకుండానే ఇటువంటి నిర్ధారణలకు రావడం కేంద్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే ఒక సాంకేతిక సంస్థ చేయవలసిన పని కాదు. ఊహాగానాలతో కేంద్రంలోని పాలక పక్షానికి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చడానికి నివేదికను వండివార్చినట్టు విమర్శలు వెల్లువెత్తాయి. అయితే అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ నదీగర్భంలో జరిగే మార్పుల కారణంగా ఈ ఘటన జరిగి ఉంటుందని డ్యాం సేఫ్టీ అథారిటీ వారే ఆ నివేదికలో పేర్కొనడం గమనార్హం. అది దురదృష్టకరమైనదే. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వారు ఏవైనా పునరుద్ధరణ చర్యలు సూచిస్తారని ఆశించిన ప్రాజెక్టు ఇంజినీర్లకు తీవ్ర నిరాశ ఎదురైంది. చివరికి తాత్కాలిక రక్షణ చర్యలను సూచిస్తూ పంపిన నివేదికలో తమకు తెలియని కొత్త పరిష్కార మార్గాలు ఏమీ లేవని, దీని కోసం నాలుగు నెలల విలువైన కాలాన్ని హరించి వేశారని ఇంజినీర్లు వాపోయారు. ఇదీ ఘనమైన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వారి నిర్వాకం. శంఖంలో పోస్తేనే తీర్థం అవుతుందన్నట్టు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వారు చెప్పినవే పరిష్కారాలు అని ప్రభుత్వం కూడా భావించి రాష్ట్ర ఇంజినీర్లను ముందుకు సాగనివ్వలేదు. తెలంగాణ బిడ్డగా శ్రీరాం ఈ విషం చిమ్మే కార్యక్రమాన్ని చేపట్టే బదులు తన పరపతిని ఉపయోగించి నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వారితో రక్షణ చర్యలకు సంబంధించి నివేదికను త్వరగా రూపొందించి ఉంటే రాష్ట్రానికి మేలు జరిగేది.

ఇసుక పునాదులపై కట్టిన నిర్మాణాల్లో లీకేజీలు సహజమే: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల.. మూడు బ్యారేజీలను ఒకే విధమైన సాంకేతికతతో నిర్మించారు కాబట్టి మేడిగడ్డకు ఏర్పడిన సమస్యలన్నీ అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో కూడా తప్పవని శ్రీరాం అభిప్రాయం. మేడిగడ్డ లాగానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా కుంగిపోయి, కూలిపోవాలన్నది కేంద్ర, రాష్ట్ర పాలకుల దుర్మార్గపు ఆలోచన. కానీ, అది ఎన్నటికీ నెరవేరదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఎటువంటి నిర్మాణపరమైన సంక్షోభం (Structural Distress) లేదనేది ప్రాజెక్టు ఇంజినీర్లకు తెలుసు. ఆ రెండు బ్యారేజీల్లో ఏర్పడిన నీటి లీకేజీలను ఎప్పటికప్పుడు కెమికల్ గ్రౌటింగ్ ద్వారా అరికడుతూనే ఉన్నారు. ఇప్పుడు ఆ రెండు బ్యారేజీల్లో ఏ లీకేజీలు లేవు. అవి పత్రికల్లో, మీడియాలో ప్రచారం అయినట్టు బుంగలు కావు, చిన్నపాటి నీటి లీకేజీలు. ఇసుక పునాదిలో (Permeable Foundations) ఇటువంటి నీటి లీకేజీలు ఏర్పడడం సహజమే. ప్రాజెక్టు ఇంజినీర్లు ఏటా తనిఖీలు చేసి లీకేజీలు ఉంటే అరికట్టే చర్యలు తీసుకుంటారు. అందుకే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు సురక్షితంగా ఉన్నాయి.

> ఇకపోతే మేడిగడ్డ బ్యారేజీ పై రెండింటితో పోలిస్తే భిన్నమైనది. మార్చి వరకు నదిలో ప్రవాహాలు ఉంటాయి. 2020, 2021లో కరోనా మహమ్మారి కారణంగా ఇంజినీర్లు, నిర్మాణ ఏజెన్సీ ఇంజినీర్లు ఎవరూ మేడిగడ్డ పోవడానికి వీలులేని ఒక భయంకరమైన పరిస్థితి. ఈ స్థితిలో రెండు వానకాలాలు లీకేజీలను బుంగలుగా మార్చాయి.

2022లో సంభవించిన వరద గోదావరి చరిత్రలోనే అతి పెద్దది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద 28 లక్షల క్యూసెక్కులకు పైబడి వరద ప్రవాహం నమోదైంది. బ్యారేజీ కింద సిమెంట్ బ్లాకులు అక్కడక్కడ లేచిపోయి ఉన్నందున చిన్న లీకేజీలు బుంగలుగా మారి, రాఫ్ట్ కింద సొరంగం ఏర్పడడానికి దోహదం చేసింది. బ్లాక్ 7లో రాఫ్ట్ కింద ఏర్పడిన ఈ సొరంగం 2023లో సంభవించిన భారీ వరదల అనంతరం అక్టోబర్ చివరి వారంలో మూడు పిల్లర్ల కుంగుబాటుకు కారణమయ్యిందని తెలుస్తూనే ఉన్నది.

> అక్టోబర్ నెలలో గోదావరిలో ప్రవాహాలు అధికంగా ఉన్నందు వల్ల ఈ బుంగలను అన్నారం, సుందిళ్లలో గమనించినట్టు ఇక్కడ సాధ్యం కాలేదు. 20 వేలకు పైగా ఇసుక సంచులను అదిమింగేయడమే సొరంగం ఏర్పడిందన్న దానికి రుజువు. భూభౌతిక పరీక్షల ద్వారా నిర్ధారణ కాకుండానే లోపాలు ఉన్నాయని ఆపాదించడం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి, వారికి వత్తాసు పలికే శ్రీరాం లాంటి వారికి సమంజసం కాదు.

తెలంగాణ పౌర సమాజంపై కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ బాధ్యత: ఏదేమైనా మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటు ఒక దురదృష్టకరమైన సంఘటన. రాజకీయాలను పక్కనపెట్టి బ్యారేజీని పునరుద్ధరించి, మళ్లీ వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే కాదు, తెలంగాణ పౌర సమాజంపై కూడా ఉన్నది. వెదిరె, రఘు లాంటి మేధావులు విషం చిమ్మడం మాని ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే సమాజానికి మేలు చేసిన వారవుతారు.

(వ్యాసకర్త: తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్)

లేఖలు

ఆరె కులస్తులను ఆదుకోవాలె

ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, సామాజికపరంగా అన్ని రంగాల్లో వెనుకబడిన కులాలలో ఆరె కులం ఒకటి. తెలంగాణలో దాదాపు పది లక్షలకు పైగా ఆరె కులస్తులు ఉన్నారు. అయితే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు గడిచినా ఆరె కులస్తులు చట్టసభల్లో అడుగుపెట్టక పోవడం శోచనీయం. దేశాభివృద్ధిలో ఎంతో కీలకప్రాత పోషిస్తున్నవారిని రాజకీయ పార్టీలు జెండాలు మోసే కూలీలుగానే చూస్తున్నాయి తప్ప, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం లేదు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ పదవులకే వారు పరిమితం అవుతున్నారు. తెలంగాణలో ఈ సామాజికవర్గానికి 5 లక్షల వరకు ఓట్లున్నాయి. అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను శాసించే స్థాయిలో వారున్నారు. వ్యవసాయం చేస్తూ పొట్ట పోసుకునే ఈ సామాజికవర్గానికి చెందినవారు ఇప్పుడిప్పుడే తమ పిల్లలను చదివిస్తున్నారు. అయితే ఈ సామాజికవర్గానికి తెలంగాణలో బీసీ-డీ సర్టిఫికెట్ ఇస్తుండగా.. కేంద్రం మాత్రం ఓబీసీ జాబితాలో చేర్చలేదు. ఈ కారణంగా యువత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు. కాబట్టి ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరె కులస్తులను గుర్తించాలి. ఓబీసీ జాబితాలో చేర్చాలి. దాంతో పాటు రాష్ట్రంలో ఆరె కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వారి అభ్యున్నతికి కృషి చేయాలి.

- మోటె చిరంజీవి

మా బాగోగులు పట్టవా!

సింగరేణి నిధులను వినియోగించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. చెమట, రక్తం ధారపోసిన రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత, అపరిమిత వైద్య సౌకర్యాలు కల్పించేందుకు తటపటాయిస్తున్నది. గోదావరి తల్లి నిస్వార్థంగా అందరికీ జలాలు అందిస్తున్నట్టే.. బొగ్గు గనుల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యోగులు దేశాభివృద్ధికి పాటుపడుతున్నారు. బొగ్గు వలె కాలికాలి ఉద్యోగ విరమణ నాటికి బూడిదైపోతున్నారు. ఆ తర్వాత శేష జీవితాన్ని అష్టకష్టంగా, భయంకరమైన రీతిలో గడపాల్సి వస్తున్నది.

ప్రమాదాలు, కాలుష్యం మధ్యనే పనిచేసే ఉద్యోగులు.. రిటైర్‌మెంట్ తర్వాత అనారోగ్యాలతో సహవాసం చేయాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో పెరుగుతున్న వైద్య ఖర్చులకు సీపీఆర్ఎంఎస్ రూ.8 లక్షలు ఎటూ సరిపోవడం లేదు. ఎక్కువ ఖర్చుతో కూడుకున్న రోగాలకు ఉచిత వైద్య సౌకర్యాలకు సంబంధించిన సర్క్యులర్ ఇప్పటివరకు జారీ కాకపోవడంతో చాలామంది ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఏరియా హాస్పిటల్‌లో ఇన్ పేషెంట్ వసతి తీసివేయడంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా పరిస్థితి తయారైంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖలు తమ రిటైర్డ్ ఉద్యోగులకు అమలుచేస్తున్నట్టు విస్తృత వైద్య సేవలు కల్పించేలా కాంగ్రెస్ సర్కార్ ఆదేశాలు జారీ చేయాలి.

- దండంరాజు రాంచందర్‌రావు

ఉద్యమ పార్టీపై ఉమ్మడి కుట్రలు

నరేష్ పాపట్ల
95054 75431

బీఆర్ఎస్ అందిస్తున్న సంక్షేమంతో పాటు అదనంగా మరింత మేలు జరుగుతుందని నమ్మి ఓట్లేసిన ప్రజలను రేవంత్ సర్కార్ వంచిస్తున్నది. హామీల అమలును పక్కన పెట్టి.. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంటూ రాజ్యాంగస్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నది. అంతేకాదు, ఉద్యమ పార్టీపై చంద్రబాబుతో కలిసి ఉమ్మడి కుట్రలకు తెరలేపుతున్నది.

పార్టీ ఫిరాయింపులకు పునాది వేసిన కాంగ్రెస్.. బీఆర్ఎస్‌పై నిందలు వేయడం విడ్డూరం. అసలు పార్టీ ఫిరాయింపులను మొదలుపెట్టిందే కాంగ్రెస్. 2004 ఎన్నికల్లో గెలిచిన 26 మంది గులాబీ ఎమ్మెల్యేల్లో 10 మందిని లాక్కున్న వైఎస్ఆర్ నాడే రాష్ట్రంలో ఫిరాయింపులకు గేట్లు తెరిచారు. ఆనాటి నుంచే ఉద్యమ పార్టీపై కుట్రలు సాగుతున్నాయి. తెలంగాణ సిద్ధించిన తర్వాత అప్పటి టీడీపీ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రలకు తెరలేపిన విషయం అందరికీ విదితమే. డబ్బు సంచులతో ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నించి రెడ్ హ్యాండెడ్‌గా ఆయన పట్టుబడటాన్ని చూసి యావత్తు ప్రపంచం నివ్వెరపోయింది. 'బ్రీఫ్డ్ మీ' అన్న మాటలను ఇప్పటికీ ఎవరూ మరచిపోలేదు. అందుకే పార్టీ ఫిరాయింపులకు పితామహుడు కేసీఆరే అని కాంగ్రెస్ నేతలు చెప్తుంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ప్రజలు నవ్వుకుంటున్నారు.

రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నిస్సిగ్గుగా తెలంగాణపై ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని చూశారు. రాజ్యాంగ పదవిలో ఉండి కూడా.. పక్క రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చేందుకు తెరవెనుక పన్నాగం పన్నారు. కుట్రలను పసిగట్టిన కేసీఆర్ జూలు విదల్చడంతో రెండు కండ్ల సిద్ధాంతం తోక ముడుచుకొని పరారైంది. బాబు కుట్రలు అక్కడితో ఆగలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ సాగాయి. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన టీడీపీ.. 2023లో రేవంత్‌కు ప్రయోజనం చేకూర్చేందుకే పోటీ చేయలేదనేది జగమెరిగిన సత్యం.

ఎన్డీయే కూటమిలో కీలక నేతగా వ్యవహరిస్తున్న చంద్రబాబుతో.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు అనధికారికంగా భేటీ కావడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఒకవైపు ఎన్డీయేలో భాగస్వామిగా ఉంటూ, మరో వైపు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పట్ల సానుకూలంగా ఉండటం ఒక్క చంద్రబాబుకే చెల్లింది. పాత టీడీపీ 'గుంపు' ఒకే గొడుగు కిందకు ఇప్పుడే ఎందుకు చేరుతోంది? ఈ ఉమ్మడి కుట్రలను నిర్మిస్తున్న 'మేస్త్రి' ఎవరన్నది సూక్ష్మంగా పరిశీలించాల్సిన అవసరం ఉన్నది.

మొదటి నుంచి బీఆర్ఎస్‌ను ఒకే రూపంలో కుట్రలు వెంటాడుతున్నాయి. రెండు దశాబ్దాలు గడిచినా కుట్రదారులు రాజకీయ వేటు కోసం మాటు వేస్తూనే ఉన్నారు. కారణం తెలంగాణను సాధించుకొని సొంత భుజాలపై మోయడం. ప్రాంత బాగుకోసం అవిశ్రాంతంగా శ్రమించడం, సాధించుకున్న సొంత రాష్ట్రంలో పరాయి పాలన వద్దు అనడం. పద్నాలుగేండ్లు రాష్ట్రం కోసం కొట్లాడి, పదేండ్లు రాష్ట్ర ప్రగతి కోసం తండ్లాడిన ఉద్యమ పార్టీని అసెంబ్లీలో లేకుండా చేయడమంటే తెలంగాణపై కుట్రలు చేస్తున్నట్టే. పరాయి పెత్తనం మళ్లీ వస్తే అమరుల ఆత్మలు ఘోషిస్తాయి. చైతన్యవంతమైన తెలంగాణ సమాజం తేరుకొని ఒక్కసారి ఆలోచించాలి.



> భట్టీయంలా భావోద్వేగరహితంగా భట్టి బడ్జెట్ ప్రసంగం కొనసాగుతుండగా, వివిధ ప్రధాన టీవీ చానళ్ల యూట్యూబ్ స్ట్రీమింగ్‌ల కింద సామాన్యులు పెడుతున్న కామెంట్లను చూస్తుంటే.. రాజకీయాల్లో స్వల్పకాలంలో ఇంతగా విశ్వాసం కోల్పోయిన సర్కార్ బహుశా ఇంకొకటి ఉండదేమోనని అనిపించింది. రేవంత్ రెడ్డి సర్కార్‌కు అండగా డోలు మెడకేసుకున్న చానళ్లలోనూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను జనమే కామెంట్ల కౌంటర్‌లతో ఈసడించుకోవడం ఆశ్చర్యం కలిగించింది. పద్దులో కేటాయింపులపై, ప్రభుత్వ ప్రతిపాదనలపై ప్రజలు ఏ మాత్రం ఆసక్తి కనబరచనేలేదు. నెల్సన్ మండేలా నుంచి నెహ్రూ దాకా కొటేషన్లు వాడుకొని బడ్జెట్ ప్రసంగానికి విలువను అద్దేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నం అపహాస్యం పాలైంది.

హామీల రద్దు.. అసత్యాల పద్దు

డాక్టర్ ఆంజనేయ గౌడ్

నిర్దిష్టమైన ఆర్థిక నమూనా, ప్రజల అనుభవంలో ప్రతిఫలించే గుణాత్మకమైన ప్రభుత్వ విధానం వెలుగులో రూపొందించే ఆదాయ, వ్యయాల ప్రణాళిక, సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి దోహదపడుతుంది. కానీ, లోతుపాతులెరుగని వాగుబోతు, పాతాళ గంగమ్మను చంచాతో తోడుతానని తొడగొట్టినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఉన్నదనే సత్యం ఆ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను చూసినా, బడ్జెట్‌ను విశ్లేషించినా ఇట్టే అర్థమైపోతుంది. గత ప్రభుత్వంపై నిందలు, వర్తమానంలో ఖాళీ లంకె బిందెల కథ తప్ప, పద్దు పుస్తకంలో కొత్త పొద్దుపొడుపు ఎక్కడుందనీ? అనేక గండాలను ఎదుర్కొని, చరిత్ర పొడుగునా నెత్తురు, చెమట ధారపోసి ఒడ్డున పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ ప్రభుత్వ బడ్జెట్ అంచనాలు గుండె ధైర్యాన్ని, గెలుపు విశ్వాసాన్ని కలుగజేసేవి. సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి, సకలజనుల సౌభాగ్యంతో పాటు వివక్షకు గురైన వర్గాల సత్వరాభివృద్ధే కొలమానంగా, బీఆర్ఎస్ ప్రభుత్వ వార్షిక ఆర్థిక ప్రణాళికలుండేవి. రాష్ట్ర తక్షణ అవసరాలు, దీర్ఘకాలిక లక్ష్యాలపై శాస్త్రీయ దృక్పథంతో కేటాయింపులు ఉండేవి. కానీ, దురదృష్టవశాత్తు కాంగ్రెస్ పార్టీ సర్కార్ రాష్ట్ర బడ్జెట్‌ను రాజకీయ కోణం దాటి, విశాల రాష్ట్ర ప్రయోజనాల పునాదిపై రూపొందించే ప్రయత్నం చేయలేకపోవడం విడ్డూరం. వెనకటికొక మతి తప్పిన దానయ్య దుకాణం తెరిచి, బంగారాన్నీ బెల్లం ధరకే అమ్మకానికి పెట్టినట్టుగా ప్రగతి ప్రణాళికను అవాంఛనీయ దృక్పథంతో రూపొందించిన హస్తం సర్కార్ బుద్ధిజీవుల విమర్శలపాలైంది. మార్పు నినాదంతో, గ్యారంటీల గంపెడాశల దన్నుతో గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం పార్టీ మ్యానిఫెస్టోను పూర్తిగా మరిచిపోయి పద్దు పుస్తకం నింపేసింది. మాటే శిలాశాసనం అనే రాచరికపు డైలాగ్‌ను మళ్లీ మళ్లీ వినిపిస్తూనే ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలకులు రాబోయే నాలుగేండ్లు నిత్యం శీర్షాసనమేసినా ఇచ్చిన హామీలు అమలుచేయలేరని, ఆ జ్ఞానమే వారిలో లేదనే సంగతి 2024-25 వార్షిక బడ్జెట్ బట్టబయలు చేసింది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి మునుపు గణాంకాల విన్యాసాలు, ఊకదంపుడు ఉపన్యాసాల ఒరవడిలోనే బడ్జెట్‌లు ఉండేవి. కానీ, స్వరాష్ట్రంలో దశాబ్దకాలం పాటు ఆకాంక్షలు, ఆశయాలే పద్దు పుస్తకంలోని ప్రతి అక్షరంలో ఉట్టిపడ్డాయి. అయితే తెలంగాణకు దిష్టి తగిలిందో ఏమో గానీ, మళ్లీ కాళ్లల్లో కట్టెపెట్టే కాంగ్రెస్ సర్కార్ నెత్తిన పడ్డది. దీంతో ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో పాత దుర్దినాలను మళ్లీ అనుభవంలోకి తెచ్చినట్టుగానే, నిన్నటి బడ్జెట్‌లోనూ కోట శ్రీనివాసరావు సినిమాలోని కోడిని వేలాడదీసే సీన్‌నే తిరిగి పండించారు. 70 పేజీల పద్దు పుస్తకంలో సింహభాగాన్ని శాపనార్థాలు, అసత్యాలతో నింపేశారు. ప్రభుత్వ రథాన్ని పరనింద ఇంధనంతో నడిపించగలమని పాలక పార్టీ భ్రమించడం చూస్తుంటే.. పాలనా శాస్త్రంలో ఓనమాలు కూడా ఒంటబట్టించుకోలేదని అందరికీ అర్థమైపోతున్నది. అసలు ఏ కొలమానం లేని కేటాయింపులు, సర్కార్ వారి ఎగనామం ఎజెండాను బహిర్గతం చేసిన తర్వాత ఇంకా ఎవరికైనా భ్రమలుంటాయా? రాష్ట్ర అస్తిత్వం, సుస్థిరత, ఆత్మగౌరవం, భవిష్యత్తు తదితర కీలకాంశాల మాట దేవుడెరుగు.. కనీసం ఇచ్చిన గ్యారంటీల అమలుకు అవసరమైన వాస్తవ కేటాయింపులను సైతం కొండెక్కించారు. పద్దు ప్రసంగాన్ని అబద్ధాలతోనే ప్రారంభించిన ఆర్థిక మంత్రి ఉద్యోగాల కల్పనపై ఉత్తరకుమార ప్రగల్భాలు వల్లించారు. నిరుద్యోగులను కాంగ్రెస్ పార్టీ సర్కార్ ఎలా కరివేపాకులా వాడిపడేసిందో ప్రజలందరికీ కండ్లకు కట్టినట్టుగా బడ్జెట్‌లో ఉద్యోగాలపై వల్లింపు కనబడుతూనే ఉన్నది కదా! హామీల అమలు కోసం నినదిస్తున్న వారిని వెక్కిరిస్తూ, కుళ్లబొడుస్తూ, కటకటాల్లోకి నెడుతూ నిరుద్యోగ యువత రుణం బాగానే తీర్చుకుంటున్నారు. జాబ్ క్యాలెండర్ కథను చెబుతూ, ఏడాదిలోపే రెండు లక్షల కొలువుల భర్తీని బురిడీ కొట్టించారు. ఇక మహాలక్ష్మీ పథకం ఎలా మహా మోసంగా మారిందో రాష్ట్రంలో ఏ మహిళను అడిగినా విడమరిచి చెబుతారు. సమయానికి రాని, బస్‌స్టాప్‌లలో ఆగని బస్సులతో ప్రయాణాన్ని దుఃఖ భరితంగా మార్చారు. గ్యాస్ సిలిండర్ స్కీం ఎంత గ్యాసో తెలియనిదెవ్వరికి? ప్రతి ఇంటి మహిళకూ రెండు వేల ఐదు వందల రూపాయలు అందజేస్తామన్న గ్యారంటీ ఊసే లేదెందుకని? ఇక రుణమాఫీ అమలు గురించి గప్పాలు చెప్పిన విత్త మంత్రి, అమలులోని అసలు నిజాలను రైతులోకం ముందు దాచిపెట్టలేరు. 11లక్షల మందికే రుణమాఫీ హామీ అమలు చేస్తూ, కత్తెర నిబంధనలతో దాన్ని రుణ టోపీ స్కీంగా మార్చేశారు. చివరికి రైతుబంధుపై కూడా బడ్జెట్ ప్రసంగంలో విషం చిమ్మడం దారుణం. రైతు భరోసాను ఎత్తేసే ఎత్తుగడలను ఏ సిగ్గూ లేకుండా సభ సాక్షిగా వెల్లడించారు.

> ఇది సృజనాత్మకతే కాదు, సున్నితత్వం కూడా లేని పద్దు. రెవెన్యూ రాబడులు, రుణాలు, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌లపై వివిధ చిత్రమైన వ్యాఖ్యలు చేసిన ప్రభుత్వం, అంచనాలలో మాత్రం వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. మొన్నటి కేంద్ర బడ్జెట్‌ను చూసిన తర్వాత కూడా మోదీ సర్కార్ నుంచి రూ.21,636.15 కోట్లు వస్తాయని పద్దులో చ